క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

వెదురుకుప్పం: మండల కేంద్రం వెదురుకుప్పంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి ఆదివారం తెలిపారు. ఈసమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. భవిష్యత్ ప్రణాళికపై సమావేశంలో కొన్ని సూచనలు సలహాలు చేయడం జరుగుతుందన్నారు.

నేడు కేవీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విజయపురం (నగరి) : మండలంలోని కేవీపురం పంచాయతీలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. ఆ క్యాంపులో అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించడం జరుగుతుందన్నారు. కేవీపురం సచివాలయ పరిధిలోని గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. అలాగే మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ఆర్బీకేలను సంప్రదించండి

నింద్ర: రైతులు వ్యవసాయ పంటల సాగులో అనుసరించవలసిన అంశాల గురించి, ఇతర విషయాలపై పూర్తి సమాచారం, సమస్యలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు సమాచారం పొందాలని ఆర్బీకే చైర్మన్ వీరయ్య తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పంటల సాగుపై, ఇతర సమస్యలు ఉంటే వారి వద్ద నుంచి పూర్తి సమాచారం పొందాలని కోరారు. రైతులు రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నై చెందిన అంబత్తూరు చెందిన గ్రామస్తులు తిరుమలకు కాలినడక బయలుదేరారు. నింద్ర షుగర్ ఫ్యాక్టరీ వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం తిరుమలకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ధరణి'ని సద్వినియోగం చేసుకోండి

పాలసముద్రం : జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిటర్లకు వాణిజ్య బ్యాంకుల కంటే డీసీసీ బ్యాంకులోనే అధిక వడ్డీ లభిస్తుందని గంగాధరనెల్లూరు డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ బ్యాంకులో ధరణి డిపాజిట్ పథకం ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు కొనసాగుతుందన్నారు. ఈ పథకం లబ్ధిదారులకు 8 శాతం వడ్డీ ఇస్తామని, సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ చేస్తే 8.50 శాతం చెల్లిస్తామని తెలిపారు. రూ.1000 ఆపైబడి మొత్తం కూడా స్వీకరిస్తామన్నారు. డిపాజిటర్లకు ఇన్సూరెన్స్ రక్షణ ఉంటుందన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

తిరుచానూరు(చంద్రగిరి): సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ముండ్లపూడిలో శనివారం ఒక వ్యక్తి తన నివాసంలో పూజలు చేస్తుంటే, కొంతమంది క్షుద్ర పూజలు చేస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్లు తెలిపారు. తిరుచానూరు పోలీసులు గ్రామానికి వెళ్లి ఆ వ్యక్తిని విచారించగా ఇంటికి వాస్తు దోషాలు ఉండడంతో అమావాస్య రోజున నవగ్రహ శాంతి పూజలు చేయించుకున్నట్టు చెప్పాడని వివరించారు.

18న కడపలో రాష్ట్ర సదస్సు

తిరుపతి కల్చరల్: కృష్ణా జలాల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేస్తోందని, దీనిపై 18న కడపలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. అయన ఆదివారం సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న ఆలోచనతో కృష్ణా జలాల పునః పంపిణీపై మోదీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. బచావత్ చట్టం ప్రకారం 81 టీఎంసీల నీటిని ఏపీ, తెలంగాణకు కేటాయించారని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని కేటాయించారని గుర్తు చేశారు. దీన్ని మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఈ నేపథ్యంలో 18న కడపలో తలపెట్టిన రాష్ట్ర సదస్సుకు తరలి రావాలన్నారు.

జగన్మాతా.. నమో నమామి



పుత్తూరు : ఆదిపరాశక్తిగా ద్రౌపదీదేవి

- అట్టహాసంగా ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు
- తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు



నింద్ర: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు



పుత్తూరు : ద్రౌపదీదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



నగరి : శైలపుత్రిగా అన్నపూర్ణేశ్వరి

నగరి : జగజ్జనని.. జగన్మాతా.. నమో నమామి అంటూ దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ఆదివారం వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, కర్పూర సుగంధ పరిమళ ద్రవ్య వీచికల నడుమ ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దేవతలకు ప్రత్యేక అలంకరణలు చేపట్టారు.

శైలపుత్రిగా అన్నపూర్ణేశ్వరి..

మండలంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి శైలపుత్రిగా అలంకరణ చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

దీక్షాబంధన అలంకరణలో వాసవీదేవి..

పట్టణ పరిధి సత్రం దక్షిణ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నవరాత్రిని పురస్కరించుకుని హోమం, పంచామృతాభిషేకం, మంత్ర పుష్పం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ అమ్మవారికి దీక్షాబంధన అలంకరణ చేయగా, మూలవర్లకు ధన అలంకరణ చేపట్టారు. ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మీనాక్షిగా కామాక్షీదేవి

పట్టణ పరిధిలోని కరకంఠేశ్వరాలయంలో నవరాత్రి పూజల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షి దేవి అమ్మవారికి మీనాక్షి అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అర్చకులు దుర్గాప్రకాష్ మంత్రోచ్ఛరణ చేయగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ అర్చన చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం దేవీ నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ఆగమ శాస్త్ర ప్రకారం అంకురార్పణ చేపట్టి, వైభవంగా ధ్వజారోహణం చేశారు. సాయంత్రం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

కార్వేటినగరం: ప్రజలు కొంగుబంగారంగా కొలిచే శ్రీబంగారమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఉభయదారులు సీఎస్ ఉదయ్‌కుమార్, సీఎస్ నందకుమార్ సమర్పించిన పట్టు వస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి 24వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో కొలువు దీర్చడం జరుగుతుందన్నారు.

అల్లియల్లమ్మ ఆలయంలో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీ అల్లియల్లమ్మ తల్లి ఆలయంలో దసరా శరన్నవ రాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అల్లియల్లమ్మ తల్లిని ముత్తుమారి అమ్మన్‌గా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ వెలసిన చెవుటి గంగమ్మతల్లి, మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడవేటమ్మతల్లి, తమిళనాడు సరిహద్దులో ఉన్న నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరీ సమేత గంగాధరేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పడవేటమ్మ తల్లిని దుర్గాదేవిగా, గిరిరాజ కన్యకా పరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరిగా, చెవుటి గంగమ్మతల్లి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి క్షేత్రంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు రాజరాజేశ్వరిదేవి అమ్మవారు శ్రీ స్వర్ణకవచాలంకరణలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు అమ్మవారికి కుంకుమ, పసుపు, పంచామృతాలు, నారికేళ జలాలతో అభిషేకించారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: పుత్తూరులోని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ దేవతగా పూజలందుకుంటున్న ఆరేటమ్మను ఆదివారం తపస్సు కామాక్షీదేవీగా పట్టు పీతాంబరాలు, విశేష సర్వాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కొలువు దీర్చారు. ద్రౌపదీదేవిని ఆదిపరాశక్తిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. సాయంత్రం పట్టణ పురవీధుల్లో అమ్మవార్లను ఊరేగించారు.



వెదురుకుప్పం: దుర్గాదేవిగా రాజరాజేశ్వరి దేవి



నగరి : దీక్షాబంధన అలంకరణలో వాసవీదేవి



జీడీనెల్లూరు: విశేష అలంకరణలో అల్లియల్లమ్మ



నగరి : మీనాక్షి అలంకరణలో కామాక్షీదేవి



పాలసముద్రం: దుర్గాదేవిగా పడవేటమ్మ తల్లి



పాలసముద్రం: రాజరాజేశ్వరిగా పరమేశ్వరి దేవి



పుష్పపల్లకిలో చెవుటి గంగమ్మ తల్లి



పుత్తూరు: తపస్సు కామాక్షీదేవి అలంకరణలో ఆరేటమ్మ

సోషల్ మీడియాదే కీలకపాత్ర



సోషల్ మీడియా ప్రతినిధులతో రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కీలకపాత్ర పోషించాలని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వర్క్ షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రతినిధులు చురుగ్గా పని చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయమని, రాష్ట్రంలో సీఎం జగనన్న, నగరి నియోజకవర్గంలో మంత్రి ఆర్కే రోజా చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, సోషల్ మీడియా ప్రతినిధులు జయకృష్ణ, శివ, చంద్రారెడ్డి, గాంధీ, వెంకటేష్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రసాదు, రాజ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డీఎస్పీ తనిఖీలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ రవికుమార్

వెదురుకుప్పం : నగరి డీఎస్పీ రవికుమార్ ఆదివారం సాయంత్రం వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం కేసుల పురోగతి, శాంతిభద్రతలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రల విషయంలో రాజీ పడకూడదన్నారు. ఆయన వెంట కార్వేటినగరం సీఐ సత్యబాబు, ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

నగరి : పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం అన్నదానం చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఆలయానికి విచ్చేసిన భక్తులతో పాటు గోవింద భక్తులకు, పాదచారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫల పుష్ప ప్రదర్శన

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. టీటీడీ గార్డెన్ విభాగం ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంతోపాటు తిరుమలలోని కల్యాణ వేదిక వద్ద ఏర్పాటుచేసిన ఫల పుష్ప ప్రదర్శనశాల, పురాణ ఘట్టాలు, పూలతో తీర్చి దిద్దిన ప్రతిమలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి











ఆధ్యాత్మిక రచనల పఠనంతో మానసిక పరివర్తన

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక రచనల పఠనంతో మానసిక పరివర్తన కలుగుతుందని ఆచార్య కె.సర్వోత్తమరావు తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆదివారం ప్రముఖ రచయిత ఆర్‌సీ కృష్ణస్వామిరాజు రచించిన యోగక్షేమం వహామ్య హం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని యోగక్షేమం వహామ్యహం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానందజీ, గరికపాటి రమేష్‌బాబు, రాజాచంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జె.రాజాచంద్ర, కోడూరు సుమన, సాకం నాగరాజు, ఏ.మల్లేశ్వర రావు, పీసీ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాపాడుకోవాలి

తిరుపతి కల్చరల్: రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి దావలె తెలిపారు. తిరుపతిలోని ఓ ప్రయివేటు భవన్‌లో ఆదివారం యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా పిల్లలందరికీ సమానం అనే భావన పెంపొందించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎం.సంయుక్త మాట్లాడుతూ మహిళలు ఉద్యమంలోకి రావడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, పద్మావతి మహిళావర్సిటీ ప్రొఫెసర్ కె.మధుజ్యోతి, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందు చేసిన అన్నమయ్య సంకీర్తనలు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నాదనీరాజనం వేదికపై ప్రముఖ కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ కొత్తగా వెలుగులోకి తీసుకువచ్చిన అన్నమయ్య సంకీర్తనలను ప్రముఖ సంగీత దర్శకులు స్వరపరిచి భక్తకోటికి అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చెన్నైకి చెందిన గాయత్రి నారాయణ, హైదరాబాద్‌కు చెందిన ఫణి నారాయణ, నేమని పార్థసారథి సుమధురంగా కీర్తనలను ఆలపించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో నిత్యాన్నదానం పథకానికి విజయనగరం జిల్లాకు చెందిన జి.దామోదరరావు రూ.లక్ష విరాళమిచ్చారు. ఆదివారం కుటుంబ సమేతంగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్య నిర్వహణాధికారి చంద్రమౌళికు అందజేశారు. ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : నిందితుడి అరెస్ట్

పుంగనూరు: పెద్దపంజాణి మండలం గల్లావారి పల్లెలో కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసి అతడి నుంచి 960 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మాధవ స్వామి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. అందిన రహస్య సమాచారం మేరకు గల్లావారిపల్లెలో దాడులు చేశారు. జగపతి అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతడు కర్ణాటకలోని రాక్‌వెల్లి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. అతడిపై కేసు నమోదు చేసి తరలించారు. దాడుల్లో ఎస్ఐ మస్తాన్‌వల్లి, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనాథరెడ్డి, నాగరాజ, నాగరాజు, గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.